www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 13 నవంబర్ 2022
5
చిత్తూరు



పోలీస్ స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ



ప్రజాశక్తి-పూతలపట్టు: పూతలపట్టు పోలీస్ స్టేషన్‌ను చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి ఆకస్మికంగా శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మహిళా పోలీసులకు పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పనితీరుపై ఎస్ఐ హరిప్రసాద్, సిబ్బందిని అభినందించారు.

ముసురువాన

- జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
- వాగులు, వంకల్లోకి చేరుతున్న నీరు
- 15 వరకూ వానలు



చిత్తూరులోని నీవా నది ప్రవాహాన్ని పరిశీలిస్తున్న నగర కమిషనర్ అరుణ

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి: జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నారు. రెండు రోజులుగా మోస్తారు మించి వానలు కురుస్తున్నాయి. దీంతో చెరువులు,వాగులు వంకల్లోకి నీరు చేరుతోంది. కాగా ఈనెల 15వ తేదీ వరకు వర్షాలు పడుతాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమయ్యింది. ఇప్పటికే కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ప్రమాదాలు వాటిల్లకుండా జిల్లా వ్యాప్తంగా కలెక్టర్ అప్రమత్తత ప్రకటించారు.

జిల్లాలో ముసురువాన పడుతోంది. రెండు రోజులుగా జిల్లాలోని 31మండలాల్లోనూ మోస్తారు వర్షాలు పడుతున్నాయి. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురుస్తున్నాయి. కానీ ఇక్కడ భారీవర్షాలు నమోదు కాలేదు. శనివారం జిల్లావ్యాప్తంగా 19మి.మి వర్షపాతం నమోదయింది. నింద్రలో అత్యధికంగా 48.2మి.మి వర్షం పడింది. తక్కువగా గంగవరంలో 5.8మి.మి వర్షపాతం నమోదయింది. 31 మండలాల్లోను వర్షాలు కురిశాయి. దీనివల్ల లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. చెరువులు, వాగుల్లో నీరు చేరుతోంది.

జిల్లా అంతటా అప్రమత్తత..

అల్పపీడనం కారణంగా ఈనెల 15వ తేదీ వరకూ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ ప్రకటన నేపథ్యంలో కలెక్టర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న యంత్రాంగాన్ని అప్రమత్తత చేస్తున్నారు. జిల్లా, డివిజన్, మండలాలలోని వివిధ సంబంధిత శాఖల అధికారులు లో అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కేంద్రంలో 24 గంటలూ అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటుచేశారు. నెంబర్ 9491077356ను ఏర్పాటు చేశారు.

జిల్లాలో వర్షం పడుతున్నందున వాగులు, వంకలు, చెరువుల వద్ద అప్రమత్తంగా ఉండాలని, నీటినిల్వ సామర్థ్యం ఎప్పటి కప్పుడు పరిశీలిస్తూ పరిసర ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వర్షాల కారణంగా రెవెన్యూ, పోలీస్, విద్యుత్, వైద్య, అగ్నిమాపకశాఖ, ఇరిగేషన్, ఇతర సంబంధితశాఖల వారు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఎక్కడా ఎటువంటి ప్రాణనష్టం, ప్రమాదాలు జరగకుండా క్షేత్రస్థాయిలో కూడా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయిలో గల అధికారులందరూ ప్రధాన కార్యస్థానాలలో అందుబాటులో ఉండి ఎక్కడా ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా సేవలందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. మండల స్థాయిలో కూడా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఎప్పటికప్పుడు పరిస్థితులను జిల్లా కేంద్రంలో గల కంట్రోల్ రూమ్ కి తెలియజేయాలన్నారు.

మత్తు జోగుతోంది..!

విచ్చలవిడిగా డ్రగ్స్ వినియోగం



చిత్తూరులో డ్రగ్స్ ముఠాను అరెస్టు చేసినప్పుడు పోలీసులు స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ (ఫైల్‌ఫొటో)

ప్రజాదృష్టి

ప్రజాశక్తి- చిత్తూరు ప్రతినిధి : జిల్లాలో మత్తు జోగుతోంది. నిన్నా మొన్నటి వరకు గంజాయి మాత్రమే అనుకుంటే ఇటీవల కాలంలో ఇది మెఫిడ్రాన్ వరకు పెరిగింది. రానున్న రోజుల్లో ఇది ఎక్కడికి వెళుతుందో తెలీని పరిస్థితి నెలకుంది. కేవలం కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులే టార్గెట్‌గా ఈ డ్రగ్స్ వ్యవహారం నడుస్తోంది. దీనిపై పోలీసులు పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల మెఫిడ్రాన్‌కు సంబంధించిన కేసులో కొందరిని డబ్బులు తీసుకుని వదిలేసిట్లు పోలీసులపై ఆరోపణలు వస్తున్నాయి. కొందరి అక్రమ ధనార్జనకు అమాయికులైన విద్యార్థుల జీవితాలు నాశనమవుతున్నాయి. ఎన్నడూ లేనివిధంగా మెఫిడ్రాన్ డ్రగ్ ఎవరికీ తెలీకుండా చాపకింద నీరులాగా మెల్లగా చిత్తూరు, తిరుపతి వంటి నగరాలకు వెళ తోంది. దీనిపై అన్నిచోట్లా ఆశ్చర్యం వ్యక్తమవుతోంది.

ఇది వరకు జిల్లాలో నాటుసారా వ్యాపారం జోరుగా సాగేది. దీనిపై ప్రభుత్వం ఎన్ని దాడులు చేసినా దానికి ఇప్పటి వరకు పూర్తిగా కట్టడి చేయలేకపోతున్నారు. ప్రతి రోజూ ఎక్కడో ఒక చోట సారా పట్టుకున్న వార్తలు వస్తూనే ఉన్నాయి. ఇదిలా ఉంటే వైట్‌నర్ విచ్చలవిడిగా దొరుకుతోంది. తక్కువ ధరకే ఇది దొరుకుతుండడంతో పాఠశాలల పిల్లలు కూడా దీనికి బానిసగా మారుతున్నారు. దీని కోసం ఎక్కడో ఒక చోట దొంగతనాలు చేసి మరీ దీన్ని తీసుకుంటున్నారు. దీని తరువాత గంజాయి వ్యాపారం ఇటీవల బాగా పెరిగిపోయింది. ఎక్కడ చూసినా ఇది దొరుకుతోంది. ఒక్కో సమయంలో ఒక్కో బరువుతో వీటిని అక్రమ రవాణా చేస్తున్నారు.

సారాయి, వైట్నర్, మెడికల్ షాపుల్లో దొరికే కొనిరకాల మందులు, మాత్రలు, సిరప్‌లు వాడకం సాగుతూ ఉంది. అయితే ఇటీవల కాలం గంజాయి కూడా దాటి మెఫిడ్రాన్ డ్రగ్‌ను మిటాయి ఆకారంలో తయారు చేసి అమ్ముతున్నారు. వీటితో పాటు ఎల్ఎస్‌డి, సింగిల్ డిప్, డబుల్ డిప్ వంటివి కూడా అందుబాటులో ఉన్నాయని పోలీసులు చెబుతున్నారు. వీటిని మాత్రరూపంలో కూడా అమ్ముతున్నారని తెలుస్తోంది. ఇలా ఇవి రూ. మూడు నుంచి ఆరు వేల వరకు విక్రయిస్తున్నారని తెలుస్తోంది. ఇలా అనేక రకాలుగా ఉమ్మడి జిల్లా కేంద్రాలైన తిరుపతి, చిత్తూరుల్లో డ్రగ్స్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. వీటి వాడకంతో యువత మత్తు బానిసగా మారుతోంది.

కెవిపిఎస్ నూతన కమిటీ ఏర్పాటు



కెవిపిఎస్ చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లా నూతన కెవిపిఎస్ కమిటీని జిల్లా కేంద్రలో నిర్వహించిన చిత్తూరు జిల్లా రెండవ మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొత్తం 21 మందితో చిత్తూరు జిల్లా కమిటీని ఎన్నుకోవడం జరిగింది. గౌరవ అధ్యక్షులుగా కాంజీవరం సురేంద్రం, అధ్యక్షులుగా పాలసముద్రం మండలానికి చెందిన ఢిల్లీ, ప్రధాన కార్యదర్శి గంగవరం మండలానికి చెందిన అన్నూరి ఈశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట ప్రధానకార్యదర్శి క్రాంతికుమార్ జిల్లా కమిటీని ప్రతిపాదించగా హాజరైన ప్రతినిధులందరు ఏకగ్రీవంగా ఆమోదించారు. జిల్లాలో దళిత సమస్యలపై నిరంతరం ఉద్యమాలు కొనసాగిస్తూ సమస్యల పరిస్కారం కోసం నిత్యం కషి చేసేలాగా ఈ కమిటీ పనిచేయాలని ఆకాంక్షించారు. కెవిపిఎస్ జిల్లాకార్యదర్శి అన్నూరి ఈశ్వర్ మాట్లాడుతూ మహాసభలో ఎన్నికైన నూతన జిల్లా కమిటీ పై ఎంతో బాధ్యత ఉందని దళితుల సమస్యలపై పనిచేయాలని అన్నారు. జిల్లాలో దళితుల సమస్యలపై నిరంతరం పోరాడతామని అన్నారు. ఉపాధ్యక్షులు రాజగోపాల్, కణ్ణన్, మురుగేషన్ సహాయ కార్యదర్శులుగా నాగరాజు, లోకయ్య రాజేష్. కోశాధికారిగా టి.మణి కమిటీ సభ్యులుగా జి.సుబ్రమణ్యం, అమరనారాయణ, సుబ్రహ్మణ్యం డి.పరదేశి, నాగరాజు, రాజశేఖర, పాకాల సుబ్రహ్మణ్యం జిల్లా కమిటీ 21 మందితో ఎన్నికయ్యారు.

బాలకృష్ణారెడ్డి ఓ ప్రత్యేక వ్యక్తి

వైఎస్ ఛాన్సలర్ రామకృష్ణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఒక్కోవ్యక్తికి ఒక్కో ప్రత్యేకతలు ఉంటాయని అయితే వైయస్సార్ సాఫల్య అవార్డు పొందిన కట్టమంచి బాలకష్ణారెడ్డికి అనేక ప్రత్యేకతలు ఉండడం వల్ల రాష్ట్ర ప్రభుత్వం ఆయనను ఘనంగా సన్మానించడం జరిగిందని ద్రవిడ వైస్ ఛాన్సలర్ రామకష్ణ అన్నారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ యూనివర్సిటీ ఎంఎస్సీ వరకు చదువుకొని వ్యవసాయ రంగం వైపు మొగ్గుచూపి రచయితగా జర్నలిస్టుగా అనేక సేవలు సంఘం కోసం చేసి జిల్లాలో ఉద్యాన పంటలలో అందంగా ఉంటున్న మామిడికి సంబంధించి పరిశ్రమల కోసం రూపశిల్పిగా పేరుపొందిన కట్టమంచి బాలకష్ణారెడ్డిని సన్మానించడం గర్వకారణం అన్నారు. శ్వేత మాజీ డైరెక్టర్ భూమన్, తెలుగు రచయితల సంఘం నాయకుడు ఎడ్ల బాలకష్ణరెడ్డి సందర్భంగా కట్టమంచి బాలకష్ణారెడ్డిని ఘనంగా సత్కరించారు.



సభలో మాట్లాడుతున్న ద్రవిడ యూనివర్శిటీ వైఎస్ ఛాన్సలర్ రామకృష్ణ

కట్టమంచి బాలకృష్ణారెడ్డిని సన్మానించిన సిఇఒ

వైస్సార్ లైఫ్ టైం అచివ్మెంట్ అవార్డు పొందిన కట్టమంచి బాలకృష్ణారెడ్డి సన్మానసభ శనివారం స్థానిక మ్యాగోభవన్‌లో నిర్వహించారు. జెడ్పి సిఇఒ ప్రభాకర్‌రెడ్డి, పలమనేరు బాలాజీలు బాలకృష్ణారెడ్డిని సన్మానించారు. ఈసందర్భంగా జడ్పీ సీఈఓ మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో మామిడి అభివద్ధికి కట్టమంచి బాలకష్ణారెడ్డి చేసిన సేవలు అభినందనీయమన్నారు. జిల్లా వ్యాప్తంగా పలు పరిశ్రమలు ఏర్పాటు చేసి ఎగుమతులను చేయించిన ఘనత ఆయనకే దక్కుతుందని, జిల్లా రచయితల సంఘము అభివద్ధికి ఎనలేని సేవలు చేసి, రచయితలను, కవులను ప్రోత్సహించినందున, ఇటీవల ముఖ్యమంత్రి, గవర్నర్ లు ఆయనకు వైయస్సార్ అచీవ్మెంట్ అవార్డు ప్రకటించడం అభినందనీయమని అన్నారు.

మంత్రిని కలిసిన బంగారుపాళ్యం నాయకులు



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని బంగారుపాళ్యంలోని వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శరత్‌రెడ్డి, జిల్లా రైతు నాయకులు ప్రవీణ్‌రెడ్డి శనివారం మంత్రి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో మండలాన్ని అభివద్ధి దిశగా తీసుకెళ్లాలని.. సమస్యలను వెంటనే పరిష్కరించి మండలా భివృద్ధికి సహకరించాలన్నారు. అనంతరం మండలాభివద్ధి పైన పలు సమస్యలపై మంత్రికి విన్నవించారు. సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మరమ్మతులకు నోచుకోని మోటరు

- రామ్‌నగర్ కాలనీవాసులకు నీటికష్టాలు
- ట్యాంకర్ నీటికి రూ.400లు



మరమ్మతుకు గురైన బోరు నుంచి మోటరు తీస్తున్న నీటి సరఫరా విభాగం సిబ్బంది

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నీటి కొరతలేదు.. ఎన్‌టిఆర్ జలాశయం నిండుగా ఉంది. భూగర్భ జలమట్టం పెరిగింది. నగర పాలకసంస్థ ఏర్పాటు చేసి బోరు మోటర్లు మరమ్మతులకు గురికావడంతో జనం నీటికష్టాలు ఎదుర్కోక తప్పడం లేదు. ఏప్పుడో 20, 25 ఏండ్ల కాలంనాటి బోరుమోటర్లు తరచూ మరమ్మతులకు గురికావడంతో వాటిని మరమత్తు చేసేందుకు 15 నుంచి 20 రోజుల సమయం పడుతుండటంతో నీటి కోసం ఇబ్బందులు తప్పడం లేదు. చిత్తూరు నగరంలో దాదాపు 120కి పైగా నగర పాలక సంస్థ నీటి సరఫరా బోర్లున్నాయి. వీటి ద్వారా రెండు రోజులకోసారి నీటి సరఫరా చేస్తుంటారు.

చిత్తూరు నగర పరిధిలోని 32వ వార్డు శ్రీ కృష్ణదేవరాయల స్ట్రీట్‌లో ఏర్పాటు చేసిన నీటి సరఫరా బోరు 13రోజుల క్రితం మరమత్తుకు గురైంది. నగర పాలక సంస్థ నీటిసరఫరా సిబ్బంది బోరుపైపులను బయటికి తీసి బోరును మరమ్మతుకు పంపారు. నేటి వరకు బోరు మరమ్మతులకు పూర్తి కాలేదు. వారంరోజుల్లో మోటరు మరత్తు చేసి నీటిని సరఫరా చేస్తామని నీటిసరపరా విభాగం సిబ్బంది చెబుతున్నా... 13 రోజులు గడచిపోవడంతో ఈ బోరు ద్వారా నీరు సరఫర చేసే దాదాపు 500 కుటుంబాలు నీటికష్టాలు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు సచివాలయ అడ్మిన్, సిబ్బంది దృష్టికి తీసుకొచ్చినా ఇదిగో అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారని ఇక్కడి ప్రజలు వాపోతున్నారు. కనీసం మున్సిపల్ ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేయకపోవడంతో అద్దె ట్యాంకర్లను ఆశ్రయించి ఒక్క ట్యాంకర్ నీటికి రూ.400 సమర్పించుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీటి షంపు ఉన్నవారు ఏదో రకంగా ట్యాంకర్ ద్వారా నింపుకుంటున్నారు. నీటి షంపు లేనివారి పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. నగర పాలక సంస్థ ఇంటి, కొళాయి, చెత్తపన్నులు వసూలు చేస్తోంది. బోరు మోటరు మరమ్మతుకు గురై రోజులు గడస్తున్నా మరమ్మతు చేయడం, ప్రత్యామ్నయం ఏర్పాటు చేయకపోవడం పట్ల ఇక్కడి ప్రజలు మున్సిపల్ అధికారులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతుకు గురైన బోరు నుండి శ్రీకృష్ణదేవరాయల స్ట్రీట్, సోనియాగాంధీ స్ట్రీట్, భగత్ సింగ్‌నగర్, రామ్‌నగర్ ఎక్స్‌టెన్ ప్రాంతాలకు నీరు సరఫరా అవుతోంది.

కాలం చెల్లిన మోటర్లు..

కాలంచెల్లిన మోటర్లు నేటికీ వాడుతుండటంతో తరచు మోటర్లు మరమ్మతులకు గురౌతున్నాయి. వీటిని మరమ్మతు చేసేందుకు నగర పాలక సంస్థ డబ్బులు సక్రమంగా ఇవ్వకపోవడం మోటర్లు మరమత్తుకు ఆలస్యం అవుతున్నట్లు సమాచారం. నూతన మోటర్లు ఏర్పాటు చేసేందుకు నగర పాలకసంస్థ ముందుకు రాకపోవడంతో నగరంలోని అనేక ప్రాంతాల్లో బోరు మోటర్లు మరమ్మతులకు గురౌతున్నట్లు సమాచారం. నగరంలోని అనేక ప్రాంతాల్లో మరమత్తులకు గురౌతున్న మోటరు తిరిగి వాడకంలోకి తీసుకువడాని 10 నుంచి 15రోజుల సమయం పడుతుండటంతో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

13 రోజులుగా బట్టలుతలేదు..

నీటికష్టంతో బట్టలు కూడా 13రోజులుగా ఉతకలేదు. ఇప్పుడూ.. అప్పుడూ.. అంటూ కాలయాపన చేస్తున్నారు. మున్సిపల్ ట్యాంకర్ రాక అద్దె ట్యాంకర్‌కు రూ.400లు చెల్లించుకోవాల్సి వస్తోంది. పన్నులు కట్టించుకుంటున్నారు. మరమ్మతుకు గురైన మోటరు ఎందుకు రిపేరు చేయరో తెలియడం లేదు. ప్రజల నీటికష్టం తీర్చేలా మున్సిపల్ అధికారులు త్వరగా బోరుమోటర్‌ను మరమ్మతు చేసి నీటి సరఫరా చేయాలి.

- పార్వతమ్మ, గృహిణి

సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవచ్చు

జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాజీ చేసుకోదగిన క్రిమినల్, సివిల్ కేసులన్ని కూడా జాతీయ లోక్‌అదాలత్‌లో సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవచ్చునని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ అధ్యక్షులు ఇ.భీమారావు తెలిపారు. శనివారం ఉదయం చిత్తూరు పట్టణం ఎస్టేట్‌లోని జిల్లాకోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్‌అదాలత్ కేసులు పరిస్కారం కార్యక్రమంలో ఆరవ అదనపు జిల్లా జడ్జి ఎన్.శాంతి, జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి డాక్టర్ ఐ.కరుణ కుమార్, బార్ అసోసియేషన్ కార్యదర్శి సి.భానుశేఖర్‌రెడ్డి, అదనపు ఎస్పీ శ్రీనివాసరావులతో కలసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ భారత సుప్రీంకోర్టు న్యాయ సేవ అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవఅధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో జాతీయ లోక్‌అదాలత్‌ను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మన దేశంలో కుటుంబ వ్యవస్థకు ఎంతో ప్రాధాన్యత కలదని ఏ బంధానికైనా నమ్మకమే ప్రధానమని, చిన్నచిన్న గొడవలను ఓర్పుతో పరిష్కరించుకోవాలే తప్ప కోర్టు వరకు రాకుండా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ మరియు మండల న్యాయ సేవ అధికార సంస్థ వద్ద పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణ కుమార్ మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో పాల్గొనున్న కక్షిదారులు ఆవేశాన్ని పక్కనపెట్టి రాజీ ప్రయత్నం చేసుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్పు సుప్రీంకోర్టు తీర్పుతో సమానమని తెలిపారు. లోక్ అదాలత్ లో కేసులు పరిస్కారించుకోవడం వల్ల సమయం, డబ్బు ఆదావుతుందన్నారు. జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా జిల్లాలోని 13 మండల కేంద్రాలలో 37 బెంచీలు, చిత్తూరు జిల్లా కోర్టు ఆవరణలో 7 బెంచీలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం కోర్టు ఆవరణలో ఎక్సైజ్ శాఖ, పోలీస్ శాఖ, వైద్య ఆరోగ్యశాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి పరిశీలించారు. లోక్‌అదాలత్ కార్యక్రమంలో పాల్గొన్న కక్షిదారులకు భోజన సౌకర్యం కల్పించడం జరిగిందని తెలిపారు. న్యాయవాదులు, డీఎస్పీలు, కోర్టు సిబ్బంది, వివిధ బ్యాంకుల అధికారులు, బీమా, చిట్ ఫండ్ సంస్థలు అధికారులు, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డుకు మహర్దశ

బెల్లం, మామిడి ఎగుమతికి ప్రోత్సాహం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: బెల్లం, మామిడి విక్రయాలకు ప్రసిద్ధి చెందిన చిత్తూరు మార్కెట్ యార్డును అధునాతనంగా తీర్చిదిద్దనున్నట్లు చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. రైతులు, వ్యాపారస్తులకు అవసరమైన సదుపాయాలను కల్పించి మార్కెటింగ్ అవకాశాలను మెరుగుపరచనున్నట్లు పేర్కొన్నారు. శనివారం మార్కెట్‌యార్డు ప్రాంగణంలో చిత్తూరు మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. కమిటీ చైర్మన్ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కొత్త కమిటీని అభినందిస్తూ అభివద్ధి కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ నగరంలోని మార్కెట్ యార్డు, బెల్లంమండి, మంగసముద్రం యార్డులలో అన్ని రకాల సదుపాయాలను కల్పించనున్నట్లు తెలిపారు. యార్డుల ఆధునీకరణ కోసం కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.వందకోట్లతో ఈ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. షెడ్ల మరమ్మతు, పైకప్పు పనులను చేపట్టాలని ఆదేశించారు. మున్సిపాలిటీ ద్వారా కాలువలు ఏర్పాటు చేస్తామన్నారు. నగర మేయర్ ఆముద, మార్కెటింగ్ శాఖ కార్యదర్శి ఇందుమతి, కమిటీ సభ్యులు రామూర్తి, వరలక్ష్మమ్మ పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తూ ప్రమాణం చేస్తున్న చిత్తూరు మార్కెట్ కమిటీ సభ్యులు

అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

నగర కమిషనర్ అరుణ

వర్షంలోనే లోతట్టు ప్రాంతాల పర్యటన



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నగరపాలక అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, ప్రజారోగ్య విభాగం, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఆదేశించారు. మరోరెండు రోజుల పాటు వర్షాలు కొనసాగుతాయన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. కమిషనర్ శనివారం మధ్యాహ్నం వర్షంలోనే నగరంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. వీరభద్రకాలనీ, ధర్మరాజుల గుడిప్రాంతంలో ప్రజలను అప్రమత్తం చేశారు. పునరావాస కేంద్రాలను సిద్ధం చేస్తున్నామని, అత్యవసర పరిస్థితుల్లో పునరావాస కేంద్రాలకు తరలిరావాలన్నారు. రిక్షాకాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రజారోగ్య విభాగం అధికారులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, వార్డు కార్యదర్శులకు మార్గనిర్దేశం చేశారు. వర్షాల కారణంగా ఎక్కడా నీరు నిల్వ చేరకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని శానిటేషన్ అధికారులను ఆదేశించారు. నిల్వనీటిని తొలగించడానికి అవసరమైన మోటార్లు, ఇతర యంత్రాలు అందుబాటులో ఉంచాలన్నారు. అవసరమైతే రాత్రి సమయంలో అందుబాటులో ఉండేలా ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించాలని అన్నారు. ప్రధానంగా నీవానది పరివాహక, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అత్యవసరమైతే బాధితులను వేగంగా పునరావాస కేంద్రాలకు తరలించడానికి ముందస్తు ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. నీవా నది కల్వర్టర్లు ఉన్న ప్రాంతాల్లో నిఘా ఉంచాలని ఆదేశించారు. నగరంలో నీటి సరఫరాకు ఇబ్బంది లేకుండా, నీరు కలుషితం కాకుండా ఇంజనీరింగ్ విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నీటిని క్లోరినేషన్ చేయించాలని, ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలి వాలంటీర్ల ద్వారా అవగాహన కల్పించాలన్నారు. వార్డు స్థాయిలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, అవసరమైన ప్రాథమిక మందులను అందుబాటులో ఉంచుకోవాలి అన్నారు. డీఈలు రమణ, వెంకట ప్రసాద్, శానిటరీ ఇన్స్పెక్టర్ చిన్నయ్య, లోకానాం, ఏఈలు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.




మురళీరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ లతా బాలాజీ

మురళీరెడ్డి కుటుంబానికి ఎంపీపీ పరామర్శ

ప్రజాశక్తి-కార్వేటినగరం: వైసీపీ సీనియర్ నాయకుడు మురళీరెడ్డి(46) గత రెండు రోజుల క్రితం ఆకస్మికంగా మృతిచెందారు. శనివారం ఎంపీపీ లతా బాలాజీ ఆళత్తూరు గ్రామానికి వెళ్లి మురళీ రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చొరవతో మురళీరెడ్డి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. మండల పార్టీ కన్వీనర్ ధనంజయవర్మ, సర్పంచ్ పుష్పాంజలి, నాయకులు పురంధర్, శేఖర్‌రెడ్డి, చిరంజీవిరెడ్డి, శేషాద్రి, లోకనాథనాయుడు, ప్రకాష్‌నాయుడు, మాజీ సర్పంచ్ రాజగోపాల్‌రెడ్డి, పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణుల కల్యాణోత్సవం



కల్యాణోత్సవం చేస్తున్న అర్చకులు

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండలంలోని వేపంజేరిలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి కల్యాణోత్సవం వేడుకలు వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం ఆలయ కళ్యాణ మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి అర్చకుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఉభయదారులుగా జనార్దన మాడభూషి వ్యవహరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అన్నదానం చేపట్టారు. ఆలయ మేనేజర్ వెంకటేశులు రెడ్డి, అర్చకులు విష్ణుస్వామి, ద్వివేది, సుందరస్వామి, గోవిందస్వామి పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సహకారంతో వీధిదీపాల ఏర్పాటు



ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మండల అధ్యక్షుడు సహకారంతో పీహెచ్‌సీ ఆవరణలో రెండు విద్యుత్తు లైట్లు ఏర్పాటు చేయించారు. గంగాధరనెల్లూరు పీహెచ్‌సీ ఆవరణలో పాముల బెడద అధికంగా ఉందని డాక్టర్లు దుర్గాదేవి, షర్మిల వీధిలైట్లు ఏర్పాటు చేయాలని మండల రెడ్ క్రాస్ సంస్థ అధ్యక్షుడు పాపిరెడ్డిని కోరారు. స్పందించిన చిత్తూరు నగరంలోని ఎం.వి కేశవరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు నిరంజన్ రెడ్డి, శ్రీధర్ రెడ్డిలను కలిసి స్థానిక పీహెచ్‌సీలోని సమస్యలను వివరించారు. స్పందించి రూ.5 వేలు వితరణ చేయడంతో కొత్తగా లైట్లను ఏర్పాటు చేశారు.

ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి




ప్రజాశక్తి - ఎస్‌ఆర్‌పురం: తుపాను ప్రభావంతో వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయని.. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహశీల్దారు షబ్బీర్ బాషా తెలిపారు. ఎస్ఆర్ పురం మండలంలో వర్షాలు ఎక్కుగా కురుస్తున్నాయని.. చెరువులు, వాగులు, వంకలు పొంగిపొర్లే అవకాశాలు ఉన్నాయన్నారు. వాగులను దాటేందుకు ఎవరూ సాహసం చేయరాదని.. అత్యవసరం అయితేనే బయటికి రావాలని, ప్రజలకు అందుబాటులో 24 గంటలు రెవెన్యూ, పోలీస్, పంచాయతీ శాఖ అందుబాటులో ఉండాలన్నారు. తుపాను కారణంగా పూరి గుడిసెలు కూలిపోవడం, వాగులో చిక్కుకోవడం వంటి ఇబ్బందులు కలిగితే వెంటనే ఫోన్‌నంబర్ 9491077028 ను సంప్రదించాలని కోరారు.

ప్రజల చెంతకే వైద్య సేవలు



ప్రజాశక్తి-పెద్దపంజాణి: గ్రామీణ ప్రాంత ప్రజలకు104 వైద్య సేవలను రాష్ట్ర ప్రభుత్వం మరింతగా చేరువ చేస్తుందని.. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోగిలేరు సర్పంచ్ రమేష్‌బాబు అన్నారు. శనివారం కోగిలేరు సచివాలయం వద్ద 104 వైద్య సేవలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం ప్రజలకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజలు పక్క రాష్ట్రంలోని కార్పోరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం తీసుకునేందుకు అవకాశం కల్పించిన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి మౌనిక, 104 వైద్యాధికారిని మెహర్జబీన్, ఎంపీహెచ్‌వో శీను, ఎంఎల్ హెచ్ పీ వరలక్ష్మి, ఏఎన్ఎం సుజాత, ఆశా కార్యకర్తలు లక్ష్మీదేవి, లలిత పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలని పెద్దిరెడ్డికి వినతి



ప్రజాశక్తి-రొంపిచెర్ల: పేదలకు ఇంటి పట్టాలు ఇవ్వాలని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని తిరుపతిలో రొంపిచెర్ల మండలం వైసీపీ బీసీసెల్ అధ్యక్షులు కోటా వెంకటరమణ కోరారు. మండలంలోని బొమ్మయ్యగారిపల్లి పంచాయితీలోని ఫజులుపేటలో ఇళ్ల పట్టాల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. స్పందించిన మంత్రి తహసీల్దార్ మొరాషావలికి ఫోన్ చేసి ఫజులుపేటలో ప్రజలకు పట్టాలు ఇవ్వాలని ఆదేశించారు. అలాగే పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

ఘనంగా జాతీయ న్యుమోనియా దినోత్సవం




ప్రజాశక్తి-కార్వేటినగరం: జాతీయ న్యుమోనియా దినోత్సవాన్ని శనివారం కత్తెరపల్లి సచివాలయంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన గడప గడపకూ ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. షుగర్, బీపీ, క్యాన్సర్ వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్య సౌకర్యం ఎంతో ఉపయోగకరమని 104 వాహనంతో ప్రభుత్వం వైద్య సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. చిన్నపిల్లలకు ఊపిరి తిత్తుల్లో నెమ్ము చేరడంతో ముఖ్యంగా 5 సంవత్సరాల లోపు పిల్లలకు, అలాగే 60 సంవత్సరాలు దాటిన వద్దులకు ఊపిరి పీల్చుకునేందుకు ఇబ్బందులు పడుతూ ప్రాణాపాయానికి గురవుతుంటారని గుర్తు చేశారు. అనంతరం 43 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుప్పయ్య, డాక్టర్ ఉదయ్, పీహెచ్ఎన్ గౌరి, పర్యవేక్షకులు అంబరిషిరాజు, సుగుణ, ఏఎన్ఎం సుమతి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

యాదమరి: యాదమరి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని యాదమరి ఉప ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు న్యుమోనియా వ్యాధిపై అవగాహన కల్పించారు. ఊపిరితిత్తుల్లో అసాధారణ ద్రవం చేరడంతో శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారుతుందన్నారు. ఈ వ్యాధిగ్రస్తులు శ్వాస తీసుకునే సమయంలో గాలితోపాటు న్యుమోనియా వ్యాధికారక క్రిములు ఒకరి నుంచి ఇంకొకరికి చేరి ఊపిరితిత్తులను ఇన్ఫెక్షన్‌కి గురి చేస్తుందన్నారు. ప్రధానంగా ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఈ వ్యాధి పోషకాహార లోపంతో కలుగుతుందన్నారు. అలాగే 60 సంవత్సరాలు పైబడిన వారికి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఆరు నెలల వరకు చిన్న పిల్లలకు తల్లిపాలు మాత్రమే పట్టడంతో వ్యాధి బారిన పడకుండా చిన్నారులు ఉంటారన్నారు. చిన్నారులకు టీకాలు క్రమంగా వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య మహిళా కార్యకర్తలు జ్యోతి, ఆశా కార్యకర్తలు ధనలక్ష్మి, అరుణకుమారి పాల్గొన్నారు.



ఆదర్శ వివాహాలను ప్రోత్సహించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు



ప్రజాశక్తి-నగరి: ప్రస్తుత సమాజంలో మహిళను తక్కువగా చూసే పరిస్థితి ఉన్న తరుణంలో యువత ముందుకు వచ్చి ఆదర్శ వివాహాలు చేసుకోవడం అభినందనీయమన్నారు శుక్రవారం రాత్రి నగిరి లో యువజన సంఘం నాయకుడు సందీప్ మహా బుద్ధ మంగళ పేరుతో బుద్ధుని విగ్రహం సమక్షంలో పెళ్లి చేసుకోవడం అభినందనీయమని సిపిఎం చిత్తూరు జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు ఆదర్శ జంట కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచీకరణలో భాగంగా యువత పెడదోరణిలో పడుతున్న సమయంలో ఇలాంటి ఆదర్శ కార్యక్రమాలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం బందం నాయకులు వెంకటేష్, పెరుమాళ్, ప్రసాద్, బాలసుబ్రమణ్యం, మైలు స్వామీ, తంగరాజు, జగదీష్ ,సతీష్, ఎలిల్, కిరణ్, నేతాజీ, రాజా పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలను మోడీ మోసగించారు

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: రాష్ట్ర ప్రజలను మోసగించిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్‌కు ఏవిధంగా వచ్చారని పీసీసీ సభ్యులు పోటుగారి భాస్కర్, పీసీసీ ఓబీసీసెల్ మాజీ కన్వీనర్ బుల్లెట్ రవి , జిల్లా మాజీ అధ్యక్షులు బండ్ల సుబ్బరాయలు ప్రశ్నించారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రధానమంత్రి మోడీ ఆంధ్రప్రదేశ్ పర్యటన ఖండిస్తూ శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014లో తిరుపతి వెంకటేశ్వరస్వామి సన్నిధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని.. ఎన్నికల ప్రచార సభలో మోసపూరిత హామీని ప్రకటించి ప్రజలచే ఓట్లు దండుకున్నారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇచ్చేది తెచ్చేది.. కాంగ్రెస్ పార్టీ ఒక్కటేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో గంగాధరనెల్లూరు, పెనుమూరు మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రబాబు, నరసింహులు నాయుడు, డీసీసీ కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి , యువరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.




- అంబేద్కర్ విగ్రహం ఎదుట కాంగ్రెస్ నాయకుల నిరసన

ప్రజలే ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలి

ఎస్‌ఆర్‌పురం: బీజేపీ మోడీ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజు అన్నారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గ సీపీఐ కమిటీ సమావేశాన్ని శనివారం నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మార్ కొండయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి మోడీ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా మతం పేరుతో ప్రజలను విభజించి ప్రజల మధ్య విభేదాలు సృష్టించడానికి ప్రయత్నం చేస్తున్నదని మోడీ అవలంబిస్తున్న విధానాలు ప్రమాదకరమని అన్నారు. ఆంధ్ర రాష్ట్రం విభజన సందర్భంగా ప్రత్యేక హోదా, విభజన హామీ చట్టాలను అమలు చేయకపోవడం దుర్మార్గం అన్నారు. మోడీ ప్రభుత్వ పాలనలో బడా కార్పోరేట్ శక్తులకు మేలు జరుగుతున్నది తప్ప మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాల అభివద్ధికి ఎలాంటి న్యాయం జరగడంలేదని వాపోయారు ,ఐదు కోట్ల మంది ఉన్నటువంటి తెలుగు రాష్ట్రానికి న్యాయం జరగకపోయినా, అభివృద్ధికి సహకరించకపోయినా ఆంధ్రప్రదేశ్‌కు రాష్ట్రానికి అమరావతి రాజధానిని చెప్పి శంకుస్థాపన చేసి అన్ని విధాలుగా ఐదు కోట్ల మంది ప్రజల్ని మోసం చేస్తున్న మోడీ ప్రభుత్వానికి వైఎస్ఆర్సిపి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ మాత్రం మోడీ ప్రభుత్వానికి వంగివంగి వత్తాసు పలుకుతున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోదండయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి జయకుమారి, గోవిందస్వామి, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీని కాపాడుకుంటాం:చల్లా రామచంద్రారెడ్డి



ప్రజాశక్తి-పుంగనూరు: పుంగనూరులో తెలుగుదేశం పార్టీని కాపాడుకుంటామని నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని మున్సిపల్ కమిషనర్ ఖాళీ చేయించిన సంఘటనపై తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నల్ల రిబ్బన్లు ధరించి శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగనూరు పట్టణంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని మున్సిపల్ కమిషనర్ ఇంటి యజమానిని బెదిరించి వారిచే ఖాళీ చేయించి వైసీపీకి తొత్తుగా మారారని ఆరోపించారు. పుంగనూరు పట్టణంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తే ఆ ఇంటి యజమానిని మున్సిపల్ కమిషనర్ పిలిపించి టీడీపీ కార్యాలయాన్ని ఖాళీ చేయించాలని.. లేదంటే ఇంటిని నిబంధనల ప్రకారం నిర్మించలేదని చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని చెప్పడంతో వారు కార్యాలయంలోని ఫర్నిచర్ బయట పెట్టడం జరిగిందన్నారు. ఇంటి యజమానిని సుమారు మూడు గంటల పాటు వారిని భయభ్రాంతులకు గురిచేసి నిర్బంధించారన్నారు. పుంగనూరు మున్సిపల్ కమిషనర్ వైసీపీకి తొత్తుగా వ్యవహరించి ఈ ఘటనకు పాల్పడ్డారని ఆరోపించారు. గతంలో జనసేన పార్టీ నాయకుడు రామచంద్రయాదవ్ నిరుద్యోగ యువత కోసం ఆయన సొంత నిధులతో జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తే అది చూసి ఓర్వలేని వైసీపీ నాయకులు పోలీసులను ఉసిగొల్పి రాత్రికి రాత్రే ఖాళీ చేయించిన ఘనత అధికార పార్టీకి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీకాంత్, చిన్నమోహన్‌నాయుడు, రెడ్డెప్పనాయుడు, సుహేల్‌బాషా, మాధవరెడ్డి, గిరి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే వెంకటేగౌడ



ప్రజాశక్తి-పెద్దపంజాణి: ప్రజా సమస్యల పరిష్కారానికి చక్కని వేదిక గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమమని.. పలమనేరు శాసనసభ్యులు డాక్టర్ ఎన్.వెంకటే గౌడ అన్నారు. శనివారం మండలంలోని, శివాడి, శంకర్రాయలపేట పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఎమ్మెల్యే, ఎంపీ రెడ్డెప్ప, జిల్లా పరిషత్ ఛైర్మన్ శ్రీనివాసులు పర్యటించారు. వైకాపా ప్రభుత్వం మూడేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాలను గడపగడపకు వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్ పరిపాలన సాగిస్తున్నారన్నారు. గ్రామ ప్రజలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించేందుకు సచివాలయ, వాలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డప్ప, వైయస్ ఎంపీపీ జీడీ బాబు, మండల కన్వీనర్ బాగా రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు శంకరప్ప, శంకర్రాయలపేట సర్పంచ్ హరినాథ్, ఏఎంసీ డైరెక్టర్లు సురేష్, ఎర్రబెల్లి శ్రీనివాసులు, సర్పంచులు శిరీష నాగశంకర్ రెడ్డి, అర్చన పథ్వీనాథ్, భార్గవ్, రవికుమార్, జిల్లా, మండల నాయకులు శంకర్‌రెడ్డి, తమ్మిరెడ్డి, శ్రీనివాసులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సరోజమ్మ, పవన్ కుమార్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించిన వైస్ ఎంపీపీ

మండలంలోని శివాడి గ్రామపంచాయతీకి శనివారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే వెంకటేగౌడను మండల వైస్ ఎంపీపీ జి.డి బాబు, ఏఎంసి డైరెక్టర్ సురేష్ గజమాలతో సత్కరించి స్వాగతం పలికారు. రాబోయే ఎన్నికల్లో పలమనేరు శాసనసభ్యులుగా వెంకటేగౌడ అత్యధిక మెజార్టీతో గెలుపొందుతారని ఏఎంసి డైరెక్టర్ సురేష్ అన్నారు.

మండల యువత ఉపాధ్యక్షుడిగా చరణ్‌రాజ్



ప్రజాశక్తి - గుడిపల్లి: మండలంలోని వైసీపీ మండల యువత ఉపాధ్యక్షుడిగా చరణ్‌రాజ్‌ను ఎంపిక చేసినట్లు నియోజక వర్గ వైసీపీ సమన్వయకర్త, ఎమ్మెల్సీ భరత్ తెలిపారు. ఈ సందర్భంగా చరణ్‌రాజ్ మాట్లాడుతూ తనపై నమ్మకం తో బాధ్యతలను అప్పగించిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్, మండల నాయకులకు కృతజ్ఞతలు చెప్పారు. తన బాధ్యత సక్రమంగా నిర్వర్తిస్తానని తెలిపారు.



వృద్ధులకు అన్నదానం చేస్తున్న ఆకుల శివ

వృద్ధులు తల్లిదండ్రులతో సమానం

ప్రజాశక్తి-కార్వేటినగరం: మండలంలోని వద్ధాశ్రమంలో ఆకుల శివ తన తండ్రి సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం వద్ధులకు అన్నదానం, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. తన తండ్రి జ్ఞాపకార్థం ఏటా వద్ధులకు అన్నదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు ప్రకాష్, సర్పంచులు మంగమ్మ, గోవింద స్వామి, నాయకులు ఆకుల గోపి, మురళీ, లక్ష్మీపతి, మునెయ్య తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వద్ధులు, గ్రామ పెద్ద లక్ష్మీపతిరెడ్డి పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన



ప్రజాశక్తి-రొంపిచెర్ల: రొంపిచెర్లలోని ఉర్దూ హైస్కూల్‌లో జరుగుతున్న నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను సర్పంచ్ ఇబ్రహీంఖాన్, ఎంపీడీవో రాజేంద్ర పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ షీరాజ్ యున్నీషా, మండల కోఆప్టెడ్ మెంబర్ ఖాదర్‌బాషా, జిల్లా మైనారిటీ కార్యదర్శి సైపుల్లాఖాన్, ఆర్‌డబ్ల్యూఎస్ వేణు, పంచాయతీ కార్యదర్శి నాగరాజ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రెడ్డి ప్రసూన్న, వార్డుమెంబర్లు నాగరాజ, నిజాం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ



ప్రజాశక్తి-పులిచెర్ల: మండలంలోని కల్లూరులో అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురికి శనివారం పూర్వవిద్యార్థులు రూ.30 వేలు విలువైన నిత్యావసర సరకులు ఉచితంగా అందించారు. కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న పూర్వ విద్యార్థులు ఇటీవల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సమ్మేళనంలో ముగ్గురు వ్యక్తులు అనారోగ్యానికి గురైనట్లు తెలుసుకున్న స్నేహితులను ఆర్థికంగా ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. మస్తాన్, ఖాదర్‌బాషా, రఫీలకు శనివారం నిత్యావసర వస్తువులను అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న స్నేహితులకు అండగా నిలబడాలనే లక్ష్యంతోనే నిత్యావసర వస్తువులను అందించామని తెలిపారు. పూర్వ విద్యార్థులు రాచపల్లి వినయ్‌కుమార్, అన్సర్, వెంకటరమణ, రెడ్డివిజయ్, చెంగల్రాయులు, సురేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో వైద్య సేవలు



వ్యాధులపై అవగాహనకల్పిస్తున్న సావిత్రి

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని నిర్వహించారు. మలేరియా వ్యాధి నివారణ చర్యలు, లక్షణాలపై సూచనలు ఇచ్చారు. హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రి, లక్ష్మి కామాక్షి, జయమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

జనసేన నాయకుడు కిరణ్‌రాయల్ అరెస్టు

- వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల



ప్రజాశక్తి-నగరి: రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపకుట్టకుండా కమీషన్లు తీసుకుంటోందని విమర్శించారన్న కారణంతో జనసేన నాయకుడు కిరణ్ రాయల్‌ను నగరి పోలీసులు శుక్రవారం రాత్రి అరెస్టు చేశారు. పోలీసులు ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరు కావాలనే షరతులతో వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేస్తున్నట్లు నగరి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి తెలిపారు. ఈ సందర్భంగా కిరణ్‌రాయల్ కోర్టు నుంచి బయటకు వచ్చిన వెంటనే జనసేన కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. చిత్తూరు జిల్లా జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అభివద్ధి పనులపై కిరణ్ రాయల్ మాట్లాడినందుకే నగరి పోలీసులు తిరుపతిలోని వారి ఇంటికి వెళ్లి అరెస్టు చేసి తీసుకెళ్లడం దారుణమన్నారు. ఇలాంటి అరెస్టులకు.. బెదిరింపులకు జనసేన కార్యకర్తలు భయపడరని తెలిపారు.

కాలువలో జారిపడి వృద్ధుడి మృతి

ప్రజాశక్తి-కార్వేటినగరం: కాలకత్యాలకు వెళ్లి నీటి కాలువలో జారిపడి వద్ధుడు మతిచెందిన సంఘటన మండల పరిధిలోని కేశవకుప్పం సమీపంలో శనివారం జరిగింది. ఏఎస్సై మునికష్ణయ్య కథనం మేరకు.. వెదురుకుప్పం మండలం నక్కలపాళ్యం గ్రామానికి చెందిన దేశయ్య(80) ఈనెల పదో తేదీన తన స్వగ్రామం నుంచి కార్వేటినగరం మండలంలోనే మునిరెడ్డికండ్రిగలో ఉన్న తన కూతురి ఇంటికి వచ్చాడు. అనారోగ్యంతో బాధపడుతున్న దేశయ్య అదే రోజు మధ్యాహ్నం మునిరెడ్డికండ్రిగ గ్రామానికి సమీపంలో ఉన్న కేశవకుప్పం సచివాలయాలనికి వెళ్లి ఏఎన్ఎం వద్ద మందులు తీసుకుని తిరిగి కూతురింటికి ప్రయాణమయ్యాడు. తానఇండ్లు క్రాస్ రోడ్డు వద్ద కాలకత్యాలు తీర్చుకునేందుకు రోడ్డుకు ఆనుకున్న కాలువను దాటే ప్రయత్నంలో జారి పడి మతి చెందాడు. రాత్రి వరకు దేశయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆరా తీశారు. శనివారం సాయంత్రం ఓ రైతుకు కాలువలో వద్ధుడి మతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు విచారించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఏఎస్.ఐ మునికష్ణయ్య పేర్కొన్నారు.

అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా రెడ్డెప్ప



ప్రజాశక్తి - చౌడేపల్లె: ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా చౌడేపల్లికి చెందిన అంబేద్కర్ భవన్ వ్యవస్థాపక అధ్యక్షులు రెడ్డెప్ప నియమితులయ్యారు. రెడ్డప్ప మాట్లాడుతూ తాను డీసీసీబీకి చేసిన సేవలకు గాను రాష్ట్ర కార్యవర్గంలో చోటు కల్పించడం ఆనందంగా ఉందన్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన రాష్ట్ర అసోసియేషన్ నాయకులకు, సహకరించిన స్నేహితులకు కతజ్ఞతలు తెలిపారు.



భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్ట్

ప్రజాశక్తి - ఓజిలి :
భార్య ఆత్మహత్య కేసులో భర్తతోపాటు మరొక నిందితురాలను పోలీసులు అదుపులో తీసుకొని అరెస్ట్ చేశారు. నాయుడుపేట రూరల్ సర్కిల్ పరిధిలోని ఓజిలి పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై.విసోమయ్య, స్థానిక ఎస్ఐ దారం. ఆదిలక్ష్మి మాట్లాడుతూ ఓజిలి మండలంలోని రాజుపాలెం గ్రామంలో భర్త వేధింపులు తాళలేక కడివేటి శ్రీలేఖ (21) ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలు తల్లి రాజేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కడివేటి చక్రతేజ, చిల్లకూరు కృష్ణమ్మ అదుపులో తీసుకుని విచారణ చేపట్టగా గత నాలుగు నెలలు క్రితం భార్య భర్తల మధ్య మనస్పర్ధలు రావడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయిందని తెలిపారు. అనంతరం కాపురానికి వస్తానని భర్తను వేడుకోగా కడివేటి చక్రతేజ ఆమెను అనుమానించి మానసిక క్షోభకు గురి చేయడంతో మృతురాలు శ్రీలేఖ నవంబర్ 9వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఆత్మహత్య చేసుకోవడం జరిగిందని తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఏఎస్ఐ రాధమ్మ, హెడ్ కానిస్టేబుల్ మధు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రచందనం స్వాధీనం- పదిమంది అరెస్టు



ప్రజాశక్తి-యర్రావారిపాలెం: ఎర్రచందనం స్వాధీనం చేసుకుని ఎనిమిది మంది స్మగ్లర్లను అరెస్టు చేసిన సంఘటన శనివారం యర్రావారిపాలెం మండలంలో జరిగింది. సీఐ తులసీరామ్, ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు.. పోలీసులకు అందిన రహస్య సమాచారంతో తమ సిబ్బందితో కలిసి శనివారం ఉదయం మండలంలోని ఎల్లమంద క్రాస్ వద్ద తనిఖీలు నిర్వహించారు. రెండు ఆటోలు, ద్విచక్రవాహనం, ఆరు ఎర్రచందనం దుంగలతోపాటు 10 మంది స్మగ్లర్లను పట్టుకున్నారు. ఇందులో ఎనిమిది మంది తమిళ నాడుకు చెందిన వారు కాగా.. ఇద్దరు తిరుపతి చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.